

### నిత్యాన్నదానానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదానానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన పానుగంటి బుచ్చిరెడ్డి దంపతులు రూ.1,00,116, కాలిఫోర్నియాకు చెందిన మన్నెం నిర్మల రూ.1,00,116 విరాళమిచ్చారు.



### అలరించిన భక్తి రంజని

శ్రీశైలం టెంపుల్: ఆలయ మాడవీధిలోని నిత్యకళావేదికపై గురువారం కర్నూలుకు చెందిన జయ, ఉషారాణి, మోహన బృందం నిర్వహించిన భక్తి రంజని భక్తులను ఆకట్టుకుంది.



### మిద్దె తోట.. ఆరోగ్య బాట!

ఇంటి పైన ఖాళీ స్థలంలో మిద్దె తోటలను నగర వాసులు అభివృద్ధి చేసుకుంటున్నారు. రకరకాల మొక్కలతో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నారు. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు.

8లో

## న్యూస్‌రీల్

### హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి చర్యలు



ఎస్సీ హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు చెప్పారు. గురువారం ఆయన నగరంలోని బీసీ, ఎస్సీ, సంక్షేమ శాఖలకు చెందిన పలు వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట కర్నూలు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి బి.మద్దిలేటి ఉన్నారు.

### ప్రతి విద్యార్థి పాస్ కావాలి

- డీఈఓ రంగారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

వెల్దుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి పాస్ కావాలని డీఈఓ రంగారెడ్డి అన్నారు. వెల్దుర్తి జెడ్పీ బాయ్స్, చెరుకులపాడు జెడ్పీ హైస్కూళ్లను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అంతకు ముందు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశమై చర్చించారు. వెల్దుర్తి బాయ్స్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ ఇందిర, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జమ్ములన్న, జయశీల పాల్గొన్నారు.

### ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు

- 18 నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించనున్నట్లు డీఈఓ వి.రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్చాలనే ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు వారి పిల్లల వివరాలను వైబ్‌సైట్ http://cse.ap.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 13వ తేదీన మొదటి విడత, ఏప్రిల్ 25న రెండో విడత లాటరీ ద్వారా సీట్ల ఎంపిక ఉంటుందని తెలిపారు.

### ఈకేవైసీకి రేపటి వరకు గడువు

కర్నూలు(సెంట్రల్): ఈ క్రాప్‌లో రబీ పంటలు నమోదు చేసుకున్న రైతులందరూ శనివారం లోపు ఈకేవైసీ చేయించుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో రబీలో 2,31,542 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసినట్లు ఈక్రాప్‌లో నమోదు చేశారని తెలిపారు. ఇందులో 2,11,496 ఎకరాలకు సంబంధించి ఈకేవైసీ పూర్తి అయిందని, మిగిలిన 5,866 మంది రైతులు శనివారం సాయంత్రంలోపు ఈకేవైసీ చేయించుకొని, వ్యవసాయం, దాని అనుబంధ శాఖల పథకాల లబ్ధిని పొందాలని సూచించారు.

### మద్దతు ధరతో శనగల కొనుగోలు



మాట్లాడుతున్న డీఏఓ వరలక్ష్మి

కల్లూరు: రైతుల వద్ద నుంచి మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వమే శనగలను కొనుగోలు చేస్తోందని జిల్లా వ్యవసాయ అధికారి పి.వరలక్ష్మి తెలిపారు. గురువారం కల్లూరు మండలం లక్ష్మీపురం రైతు భరోసా కేంద్రంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటా మద్దతు ధర రూ. 5,335 గా నిర్ణయించిందన్నారు. ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల నుంచి శనగలను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఏడీఏ సాలురెడ్డి , కల్లూరు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులురెడ్డి, ఎదురూరు ఫార్మ్ వ్యవసాయ అధికారి బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# వినరో భాగ్యము!

**ఆరోగ్యశ్రీ కింద 'కాక్లియర్ ఇంప్లాంట్' ఆపరేషన్**

- నంద్యాల కేంద్రంగా నిర్వహణ
- ఇప్పటి వరకు 75 ఆపరేషన్ల నిర్వహణ
- రూ.12లక్షల వ్యయం పూర్తి ఉచితం
- రెండేళ్ల పాటు ఉచితంగానే సౌండ్ థెరపీ
- నేడు 'ప్రపంచ వినికిడి సమస్య అవగాహన దినం'



ముద్దులొలికే చిన్నారులు.. కానీ ఎవ్వరితోనూ మాట కలపరు. అసలు కలిసేందుకూ ఇష్టపడరు. కారణం తమ వినికిడి లోపం సమస్య ఎక్కడ బయటపడుతుందోనని. ఎదుటివారు చెప్పేది వినిపించదు కాబట్టి విషయం అర్థం కాదు. సమస్య ఉందని చెప్పుకోలేక.. అర్థం అయ్యి, కానట్లు ఏదో ఒకటి మాట్లాడబోయి అవమానం పాలవుతుంటారు. ఈ సమస్య చాలా మంది చిన్నారులను వేధిస్తోంది. వినికిడి మిషన్లు పెట్టుకుంటే గేలి చేస్తారనే భయం. ఇలాంటి వారికి అవగాహన కల్పించేందుకే ప్రతి ఏటా మార్చి 3న 'ప్రపంచ వినికిడి సమస్య అవగాహన దినం' నిర్వహిస్తున్నారు. ఇలాంటి చిన్నారులకు ఆరోగ్యశ్రీ ఓ వరం కాగా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఆపరేషన్లను ఖర్చుకు వెనుకాడకుండా కొనసాగిస్తుండటం విశేషం.

కర్నూలు(హాస్పిటల్)/బొమ్మలసత్రం(నంద్యాల): కంటికి రెప్పలా చూసుకునే పిల్లలకు వినికిడి సమస్య ఉందని తెలిస్తే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. సమస్యను గుర్తించేలోపు తీవ్రత అధికమవడం.. ఆపరేషన్‌కు ఆర్థిక స్థోమత సహకరించకపోవడం పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపుతోంది. ఇప్పుడు ఒక్క సంవత్సరమే కదా.. ఐదేళ్ల వరకు కొందరిలో ఆలస్యంగానైనా చెవులు వినిపిస్తాయి, మాటలు వస్తాయనే ఆలోచన మొదటికే మోసం తీసుకొస్తుంది. చిన్న వయస్సులోనే ఈ సమస్యను గుర్తిస్తే ఆరోగ్యశ్రీ కింద లక్షలాది రూపాయల విలువ చేసే ఆపరేషన్ పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నారు. 2010లో నంద్యాల కేంద్రంగా మధుమణి ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఆపరేషన్లు ఎంతో మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

**ఇలా స్పందిస్తుంటే వినికిడి లోపం లేనట్లే..**

- 3 నెలల్లోపు పిల్లలు పెద్ద శబ్దాలకు ఉలిక్కి పడటం, కళ్లు మూసుకోవడం, ఏడవటం.
- 3 నుంచి 6 నెలల్లోపు పిల్లలు శబ్దం వస్తున్న వైపు తల తిప్పడం. నిద్ర పోతున్న సమయంలో కళ్లు తెరవటం, పిలిస్తే చూడటం, గొంతు నుంచి అక్షరాలు శబ్దం చేయటం.
- 6 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు పేరుతో పిలిస్తే వెంటనే స్పందించటం. చెప్పిన పని చేయటం, భాష పలకడం కోసం ప్రయత్నించటం.
- ఏడాది నుంచి 2 ఏళ్లలోపు చిన్నారులు అత్త, మామ లాంటి పదాలు పలకడం, శరీర భాగాలు గుర్తించటం. బొమ్మలను గుర్తించటం, పదాలు స్పష్టంగా పలకడం.

**చెవి వెనుక కాక్లియర్ ఇంప్లాంట్**

సాధారణంగా మేనరికం వివాహాలు చేసుకున్న దంపతులకు వినికిడి లోపం ఉన్న చిన్నారులు పుడుతుంటారు. అలాగే నెలలు నిండకుండా జన్మించిన పిల్లలు, బరువు తక్కువ పిల్లల్లో ఇలాంటి సమస్య కనిపిస్తుంది. ఇటువంటి పిల్లలకు ఈఎన్‌టీ వైద్యులు చికిత్సకు ముందు జన్యుపరమైన లోపాలను గుర్తిస్తారు. రక్తంలో లోపాలు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, మెదడు చురుకుదనం పరీక్షలు చేయించిన అనంతరం కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేస్తారు. ఈ ఎలక్ట్రానిక్ పరికరాన్ని చెవి వెనుక భాగం వద్ద అమరుస్తారు. ఆరోగ్యశ్రీ కింద రూ.12 లక్షల విలువ చేసే ఈయంత్రాన్ని ఉచితంగా అమరుస్తుండటం ఎంతో మంది చిన్నారులకు వరంగా మారింది. ఆ తర్వాత సౌండ్ థెరపీతో ఏడాది పాటు శిక్షణనిచ్చి మాటలు నేర్పుతారు.



**వినికిడి పరీక్ష ఇలా చేయించుకోవాలి**

వినికిడి సమస్య ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే ఈఎన్‌టి వైద్యులు, ఆడియాలజిస్టు వద్దకు వెళ్లి ఆడియోమెట్రి పరీక్ష చేయించుకోవాలి. దీని వల్ల ఎంత శాతం వినికిడి కోల్పోయింది. ఎందువల్ల అని నిర్ధారణ అయితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఆడియోమెట్రిక్ పరీక్ష చేయించుకున్న తర్వాత సెన్సార్ హియరింగ్ లాస్ అయితే వినికిడి మిషన్, హియరింగ్ ఎయిడ్ తప్పనిసరిగా వాడాలి. దీనివల్ల చిన్నశబ్దాలు, మాటలు మొదలుకొని దూరం నుంచి వచ్చే శబ్దాలు, మాటలు చక్కగా వినిపిస్తాయి. ఉన్న వినికిడి లోపం పెరగకుండా కాపాడుకోవచ్చు. కంప్యూటరైజ్డ్ వినికిడి మిషన్లు చెవిలోపల, చెవి వెనుక కనిపించకుండా అమరుస్తారు.

**తల్లిదండ్రులకు భారమైనా..**



ఈ చిన్నారి పేరు యశస్విని. వయస్సు ఆరేళ్లు. మూడేళ్ల వయస్సులో మాటలు రాకపోవడం, శబ్దాలకు స్పందించకపోవడంతో వైద్యులకు చూపించగా వినికిడి లోపం ఉన్నట్లు వెల్లడైంది. తల్లిదండ్రులు ప్రొద్దుటూరులో పాపకు తాత వరుస అయ్యే కార్పెంటర్ నరసింహాచారి వద్ద వదిలి వెళ్లారు. అంతంత మాత్రమే ఆర్థిక స్థోమత ఉన్న ఆయన నంద్యాలలో ఆరోగ్యశ్రీ ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ చేయిస్తున్నారని తెలుసుకొని ఇక్కడికి తీసుకొచ్చాడు. ఇక్కడ రూ.12లక్షల విలువ చేసే ఆపరేషన్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేయడంతో ప్రస్తుతం ఆ పాప వినికిడి సమస్యకు పరిష్కారం లభించింది.

**చిగురించిన ఆశలు**



ఈ ఫొటోలోని చిన్నారి పేరు రక్షిక నందన. వయస్సు ఐదేళ్లు. కర్నూలులో నివాసం ఉంటున్న పాప తండ్రి తిలక్‌బాబు ఐదేళ్ల క్రితం మెడికల్ రెప్‌గా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పక్షవాతం వచ్చి కాలు, చేయి పూర్తిగా పడిపోయాయి. తనకు వచ్చే రూ.3వేల పింఛనుతో పాటు భార్య కూలి పనులకు వెళ్తుండటంతో కుటుంబం గడుస్తోంది. ఈ పరిస్థితుల్లో పాపకు వినికిడి లోపం ఉందని తెలిసి గుండె పగిలినా.. నంద్యాలలో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ విజయవంతంగా పూర్తయింది. ఇప్పుడు పాప యథాస్థితికి చేరుకోవడంతో ఆ ఇంట్లో ఆనందం నిండుకుంది.

**లోపం చిన్నబోయింది**



ఐదేళ్ల ఈ బాలుడి పేరు జాన్విత్. స్వగ్రామం ఆళ్లగడ్డ మండలంలోని దొర్నిపాడు గ్రామం. రెండేళ్ల వయస్సులో తమ కుమారుడికి వినికిడి లోపం ఉన్నట్లు గుర్తించి ఆసుపత్రుల్లో చూపించారు. ఇక మాటలు రావని తెలిసి తల్లడిల్లిపోయారు. తండ్రి రామయ్య నిరుపేద రైతు. ఈ పరిస్థితుల్లో ఖరీదైన చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేక మిన్నకుండిపోయారు. అయితే గ్రామానికి వచ్చిన ఓ ప్రభుత్వ వైద్యుని ద్వారా ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారని తెలిసి నంద్యాలకు చేరుకున్నాడు. అక్కడ ఆపరేషన్ విజయవంతం కావడంతో సౌండ్ థెరపీ కూడా జరుగుతోంది.

**నిర్లక్ష్యం చేయవద్దు**



పిల్లలు రెండేళ్లలోగా శబ్దాలకు స్పందించకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలి. చాలా వరకు ఇళ్లలో పెద్దవాళ్లు ఐదేళ్ల వరకూ మాటలు రావని, నెమ్మదిగా అవే వస్తాయని చెబుతుంటారు. అలా చెయ్యటం వల్ల పిల్లల భవిష్యత్తును తల్లిదండ్రులే అంధకారంలోకి నెట్టినవారు అవుతారు. లోపాన్ని త్వరగా గుర్తించి సరైన చికిత్స చేయించాలి. వినికిడి లోపం పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకం ఓ వరం.

– మధుసూదన్‌రావు, ఈఎన్‌టీ వైద్యులు, నంద్యాల

**ఆరోగ్యశ్రీలో ఉచితంగా ఆపరేషన్లు**

పుట్టుకతోనే వినికిడి సమస్య ఉన్న ఐదేళ్లలోపు పిల్లలకు ఆరోగ్యశ్రీ కింద కాక్‌క్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీ పూర్తిగా ఉచితం. చెవిలో రంధ్రం పడిన వారికి మైరింగోప్లాస్టీ అనే ఆపరేషన్ సైతం ఆరోగ్యశ్రీలోనే నిర్వహిస్తారు. నంద్యాలలోని మధుమణి ఆసుపత్రిలో 2010 నుంచి ఇప్పటి వరకు 75 కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు నిర్వహించారు. తాజాగా ఆపరేషన్ల నిర్వహణకు శాంతిరామ్ జనరల్ ఆసుపత్రి యాజమాన్యం కూడా ముందుకొచ్చింది.

– డాక్టర్ రఘు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

## ఎన్నికల వ్యయంపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): శాసన మండలి ఎన్నికల్లో అభ్యర్థులు చేసే వ్యయంపై ప్రత్యేక నిఘా ఉంచాలని సహాయ వ్యయ పరిశీలకులు, వీడియో వీవింగ్ టీమ్ సభ్యులకు జిల్లా సహకార అధికారి, జిల్లా వ్యయ పరిశీలకులు రామాంజనేయులు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆరుగురు సహాయ వ్యయ పరిశీలకులు, మూడు వీడియో వీవింగ్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి రోజు తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. మండలి ఎన్నికలకు సంబంధించి వ్యయ నియంత్రణపై పరిమితులు లేవని, అయితే వ్యయం చేసే నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో పోటీ చేసే అభ్యర్థులు చూపాల్సి ఉంటుందన్నారు.

## నిష్పక్షపాతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): నిష్పక్షపాతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌పై పీఓ, ఏపీఓలతో మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మార్చి 13వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తికమక పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి సంతకాలు తీసుకుని రిసెప్షన్ సెంటర్‌కు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ, డీఆర్వో ఎస్.నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్, డీపీఓ నాగరాజు నాయుడు, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి, డ్వామా ఏపీడీ సలీం బాషా, పీఓ, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

**గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి**

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. రూఫ్, రూఫ్ కాంక్రీట్ లెవల్‌లో ఉన్న గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తి చేయించాలన్నారు. అమృత్ సరోవర్ ట్యాంకుల నిర్మాణాలను వేగవంతం చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డికి సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని పీఆర్‌ఎస్‌ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ పనితీరు 'ఎక్సలెంట్'

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ శాఖ ఫిబ్రవరి నెలలో 'ఎక్సలెంట్' పనితీరును కనబరిచింది. వైఎస్సార్ యాప్‌లో నమోదైన సమాచారం ఆధారంగా ప్రతి నెలా ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, ఏవోలు, ఏడీఏలకు మార్కులు ఇస్తారు. మార్కుల ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారు. 95 మార్కులుపైన వస్తే ఎక్సలెంటు, 75 నుంచి 95 మార్కులు వస్తే గుడ్, 50 నుంచి 75 మార్కులు వస్తే యావరేజ్, 50 మార్కుల వరకు వస్తే పూర్‌గా పరిగణిస్తారు. కర్నూలు జిల్లా వ్యవసాయశాఖకు ఓవరాల్‌గా ఎక్సలెంటు ర్యాంకు లభించింది. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీకి ఎక్సలెంటు ర్యాంకు, ఆదోని, ఆలూరు ఏడీఏలకు గుడ్, పత్తికొండ ఏడీఏకు యావరేజ్ ర్యాంకు లభించింది. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా.. 223 ఆర్‌బీకేలకు ఎక్సలెంటు, 152 ఆర్‌బీకేలకు గుడ్, 39 ఆర్‌బీకేలు యావరేజ్, 39 ఆర్‌బీకేలు పూర్‌గా ఉన్నట్లు వైఎస్‌ఆర్ యాప్ ద్వారా నిర్ధారణ అయింది. కర్నూలు, సి.బెళగల్, ఓర్వకల్లు, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, ఆదోని, హొళగుంద, ఆస్పరి, వెల్దుర్తి ఏవోలకు ఎక్సలెంటు గుర్తింపు లభించింది. మిగిలిన అన్ని మండలాల ఏవోలకు 'గుడ్' ప్రశంసలు వచ్చాయి.

### ఎంపీడీఓ కార్యాలయాల్లో ఓటరు జాబితా ప్రచురణ

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఫొటో ఎలక్ట్రోల్ రోల్స్‌ను ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురించినట్లు జిల్లాపరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో 4 ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయని, స్థానాలకు సంబంధించి ఓటరు జాబితాలను ప్రచురించామని పేర్కొన్నారు.

## ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

కర్నూలు(అర్బన్): జిల్లాలో 2010–2016 మధ్య కాలంలో ఆధార్ కార్డు పొందిన వారందరూ తప్పనిసరిగా తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలక్రిష్ణారెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పట్లో ఎలాంటి డాక్యుమెంట్స్ తీసుకోకుండా ఆధార్ నమోదు చేసిన దృష్ట్యా, ప్రస్తుతం బోగస్ ఆధార్ కార్డులను ఏరి వేస్తున్న నేపథ్యంలో ఆధార్ ఉన్న ప్రతి పౌరుడు తనకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో అప్‌డేట్ చేసుకోవాలన్నారు. గత పది సంవత్సరాలుగా ఆధార్‌లో ఎలాంటి మార్పులు చేసుకోని వారు కూడా తమ పేరు, గుర్తింపు, చిరునామా తదితర వివరాలను పునః పరిశీలించుకోవాలన్నారు. మొబైల్ నెంబర్, బయోమెట్రిక్, పుట్టిన తేదీ మార్పు చేసుకోవాలనుకుంటే, ముందుగా అప్‌డేట్ చేసిన అనంతరం వారి నుంచి ఆయా మార్పులకు సంబంధించిన ధృవపత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు రూ.50 చార్జీ వసూలు చేస్తారన్నారు. అప్‌డేట్ చేసుకోకుంటే 2023 ఆగస్టు అనంతరం ఆధార్‌కార్డులు సస్పెండ్ అవుతాయన్నారు.

## రెచ్చిపోతున్న వాహన దొంగలు!

- పెరుగుతున్న వాహన చోరీ కేసులు
- నాలుగేళ్లలో 650 వాహనాల అపహరణ
- రికవరీ చేసింది 183 మాత్రమే



అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న ఆటోలు (ఫైల్)

కర్నూలు: రద్దీ ప్రాంతాలు, వ్యాపార సముదాయాలే లక్ష్యంగా వాహన దొంగలు రెచ్చిపోతున్నారు. హ్యాండిల్ లాక్ వేసి పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను క్షణాల్లో మాయం చేస్తున్నారు. గతేడాది జిల్లాలో 146 ద్విచక్ర వాహనాలు, 35 ఆటోలు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసి కొన్నింటిని స్వాధీనం చేసుకున్నారు. పోయిన వాటిలో 30 శాతం వరకు వాహనాల జాడ ఇంతవరకు కనిపించ లేదు.

**అపహరించి అమ్మేస్తారు...**

రాత్రి ఇంటి ముందు పార్క్ చేసిన తర్వాత ఉదయం వరకు బండి వైపు చూసుకునే అవసరం ఉండదు. దీంతో దొంగలు పక్కాగా రెక్కీ చేసి అర్ధరాత్రి సమయాల్లో అపహరిస్తున్నారు. కర్నూలు పాతబస్తీ రాధాకృష్ణ టాకీస్ వీధిలో ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన ఓ ప్రైవేటు ఉద్యోగి బైక్‌ను అక్టోబర్ 13వ తేదీన అపహరించారు. కర్నూలు నగరంలోని నందికొట్కూరు రోడ్డు సమీప కాలనీలో నివాసముంటున్న రాఘవేంద్ర బైక్‌ను, సి.క్యాంప్ రైతుబజార్ వద్ద ఉన్న చర్చిలో పని చేసే ధనరాజ్ బుల్లెట్ వాహనాన్ని, మద్దూర్ నగర్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రఘు బైక్‌ను ఇళ్ల ముందు పార్క్ చేసి ఉంచగా చోరీ చేశారు. తస్కరించిన వాహనాలు పాతవి అయితే విడి భాగాలు ఊడదీసి ఇనుప సామాన్ల దుకాణాల్లో అమ్మేస్తుంటారు. పేరున్న కంపెనీల నాణ్యమైన విడి భాగాలను మెకానిక్‌లకు, అవసరమున్న పాత వాహనదారులకు విక్రయిస్తుంటారు. అలాగే నంబర్ ప్లేట్స్ తీసేసి గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు అమ్మేస్తారు. అక్కడైతే పోలీసుల పర్యవేక్షణ తక్కువగా ఉండటంతో పట్టణాలకు వచ్చే అవసరం అంతగా ఉండదు.

**కేసుల దర్యాప్తు ఇలా..**

బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగానే కేసు నమోదు చేసి ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తారు. నిందితుల జాడ దొరికితే ఏయే ప్రాంతాల మీదుగా వెళ్లారో పరిశీలించి పట్టుకుంటారు. పాత నిందితులను ఆరా తీయడంతో పాటు ఇనుప సామాన్లు (గుజిరీ) దుకాణాల్లో ఆరా తీస్తారు. సీసీ పుటేజీలు లేనిచోట పాత నేరస్తుల జాబితా, వేలి ముద్రల ఆధారాలు, సెల్ ట్రాకింగ్ ద్వారా దొంగలను పట్టుకుంటున్నారు.

**వాహనాల దొంగతనాలు, రికవరీ వివరాలు..**

| సంవత్సరం | నమోదైన కేసులు | రికవరీ చేసిన వాహనాలు |
|---|---|---|
| 2019 | 181 | 44 |
| 2020 | 163 | 36 |
| 2021 | 160 | 70 |
| 2022 | 146 | 33 |
| మొత్తం | 650 | 183 |

**అంతర్‌రాష్ట్ర దొంగలను పట్టించిన నిఘా నేత్రాలు...**

హైదరాబాద్ చార్మినార్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ అలీ, అతని సోదరి భర్త సయ్యద్ సమీర్ ఆటోడ్రైవర్లు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించే మార్గాన్ని ఎంచుకున్నారు. కర్నూలులో ఆటో చోరీ చేసి గుట్టుగా రాష్ట్ర సరిహద్దులు దాటించి హైదరాబాదులో విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఇలా ఆరు నెలల్లో 14 ఆటోలు ఎత్తుకెళ్లారు. పాత కల్లూరులోని ఓ ఇంటి వద్ద, కొత్తబస్టాండ్ సమీపంలోని స్పెన్సర్స్ వద్ద ఆటోలు చోరీకి గురైనట్లు యజమానులు నర్సోజీ, మధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయా ప్రాంతాల్లోని సీసీ పుటేజీలో ఆధారాలు సేకరించి అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి కటకటాలకు పంపారు. అలాగే కర్నూలు డాక్టర్స్ కాలనీకి చెందిన 17 ఏళ్ల బాలుడి నుంచి ఇటీవల 9 బైకులను రికవరీ చేశారు.

**కేసుల నమోదులో అలసత్వం...**

వాహన చోరీ ఘటనలపై ఫిర్యాదులు అందినప్పటికీ పోలీసులు సత్వరమే కేసులు నమోదు చేయడం లేదు. దొరికే అవకాశముంటుందని చెప్పడంతో వాహనదారులు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ఇలా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో పదుల సంఖ్యలో వాహన చోరీ ఫిర్యాదులు ఉంటున్నాయి. తనిఖీల్లో అనుకోకుండా పట్టుబడినప్పుడు మాత్రమే కేసులు నమోదు చేసి వాటిని రికవరీ చూపి బాధితులకు అప్పగిస్తున్నారు.

**భద్రతపై శ్రద్ధ వహించాలి**



వాహనాలను భద్రపరుచుకోవడంపై యజమానులు శ్రద్ధ వహించాలి. అలారం సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. చాలా మంది పార్కింగ్‌కు కేటాయించిన స్థలాల్లో కాకుండా రోడ్ల పక్కన వాహనాలను వదిలేస్తూ సులభంగా తస్కరించేందుకు వీలు కల్పిస్తుంటారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి.

–సిద్ధార్థ్ కౌశల్, ఎస్పీ

## క్లుప్తంగా

### తంగెడంచలో చోరీ

జూపాడుబంగ్లా: మండలంలోని తంగెడంచ గ్రామంలో గురువారం తెల్లవారు జామున ఓ ఇంట్లో దొంగలు పడి 3 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.30 వేల నగదును మూట గట్టుకొని ఉడాయించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కోళ్ల వెంటేశ్వర్లు బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి సమీపంలో ఉన్న పూరి గుడిసెలో నిద్రించాడు. గురువారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా తాళం తీసి ఉండటం, బీరువాలో నగదు, ఆభరణాలు కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ జయన్న ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### చీటింగ్ కేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రి అర్బన్: మేలిమి బంగారం పేరుతో నకిలీ నాణేలు అంటగట్టి మోసం చేసిన కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం తాడిపత్రి పట్టణ ఎస్‌ఐ ధరణీబాబు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 7న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన సుజాత, రంజిత్, విక్రమ్... తాడిపత్రిలోని సంజీవనగర్ గోకుల్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఎల్.నరసింహులు, శ్రీదేవి దంపతులను కలిశారు. తమ వద్ద రూ. 5లక్షలు విలువ చేసే పురాతన మహిమ గల బంగారు నాణేలున్నాయని వాటిని తీసుకుంటే అంతా మంచే జరుగుతుందని నమ్మించారు. వారి మాయలో పడిన నరసింహులు దంపతులు.. తమ వద్ద రూ.4 లక్షలు ఉన్నాయని చెప్పడంతో కాసేపు బేరమాడి ఆ మొత్తాన్ని తీసుకుని కొన్ని నాణేలు ఇచ్చి గుట్టు చప్పుడు కాకుండా ఉడాయించారు. అనంతరం తాము కొనుగోలు చేసిన బంగారు నాణేలను స్థానిక ఓ నగల వర్తకుడి వద్ద చూపించారు. అవి నకిలీ బంగారంగా వర్తకుడు ధ్రువీకరించడంతో తాము మోసపోయినట్లుగా గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సుజాత, రంజిత్, విక్రమ్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.





ఈ చిత్రంలో కనిపించే మహిళపేరు సుధారాణి. కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన ఈ మహిళ జ్యువెలరీ వ్యాపారంలో రాణిస్తున్నారు. తమ నివాసంలోని 4వ అంతస్తును టెర్రస్ గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ఇందులో పండ్లు, పూలు, కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు కట్టడం, ఎరువులు వేయడం, పాదులకు మట్టి వేయడం తదితర పనులు చేస్తున్నారు. ఇంటికి అవసరమైన కూరగాయలు, ఆకు కూరలు సొంతంగా పండించినవే వినియోగిస్తున్నారు. వాట్సాప్‌లో సిటీ టెర్రస్ గ్రూపును ఏర్పాటు చేసి టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకోవడానికి ప్రోత్సహిస్తున్నారు.



కూరగాయలు చూపిస్తున్న ఈయన పేరు గుజరాతి ఎల్లప్ప. షరాఫ్ బజారులో జ్యువెలరీ మేకర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఇంటిపైన దాదాపు 150 వెరైటీలతో పండ్లు, కూరగాయలు, తీగజాతి కూరగాలు, ఆకు కూరలు, పూలు, ఔషధ మొక్కలు ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం మిద్దె తోటకు శ్రీకారం చుట్టగా.. నేడు నందనవనంగా మారింది. కుటుంబానికి అవసరమైన అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. మిద్దె తోటలో పనిచేయడం మానసిక ఆనందాన్ని ఇస్తుందని గుజరాతీ ఎల్లప్ప తెలిపారు.

# మిద్దె తోట..ఆరోగ్య బాట!

- టెర్రస్ గార్డెన్లపై నగరవాసుల ఆసక్తి
- వాట్సాప్ గ్రూపుల ద్వారా అవగాహన
- పండ్లు, పూల మొక్కల పెంపకం
- పండుతున్న కూరగాయలు, ఆకు కూరలు
- రసాయన రహితంగా సాగు



టెర్రస్ గార్డెన్‌లో వివిధ రకాల మొక్కలు



కర్నూలు బుధవారపేటలో మిద్దెతోట

కర్నూలు(అగ్రికల్చర్): ఉరుకులు పరుగుల జీవితం.. తీవ్ర పని ఒత్తిడి.. ప్రశాంతత కోసం బయటకు వెళ్లాలన్నా దొరకని సమయం.. ఈ నేపథ్యంలో నగరవాసులు ఇంటినే నందనవనంగా మార్చుకుంటున్నారు. ఇంటి పైన ఖాళీ స్థలంలో మిద్దె తోటలను అభివృద్ధి చేసుకుంటున్నారు. రకరకాల మొక్కలతో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నారు. మార్కెట్లో కూరగాయలు, ఆకు కూరల నాణ్యత తక్కువగా ఉంటోంది. రసాయన అవశేషాలు కూడా ఉంటున్నాయి. దీంతో ఇంటి పంటకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు సేంద్రియ పద్ధతుల్లో పండిస్తూ ఆరోగ్యానికి బాటలు వేసుకుంటున్నారు.

**ఖర్చు తక్కువే..**

మిద్దె తోటల పెంపకం కోసం పెద్ద ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఇంట్లో వాడి పడేసిన పాత బకెట్లు, సిమెంటు తొట్లు, ప్లాస్టిక్ సంచులు, టబ్బులు ఉంటే సరిపోతుంది. ఇంట్లో ఎవరో ఒకరు ఉదయం, సాయంత్రం కొంత సమయాన్ని తోట అభివృద్ధికి కేటాయించాల్సి ఉంది. తోటలో పని చేయడం వల్ల శరీరానికి తగిన వ్యాయామం లభిస్తుంది. రసాయనాలు వాడకుండా పండించని కూరగాయలు, ఆకు కూరలు, పండ్లను ఆహారంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. మిద్దె తోటలతో స్వచ్ఛమైన గాలిని పీల్చుకోగలుగుతున్నామని పలువురు నగరవాసులు చెబుతున్నారు.

**వాట్సాప్ గ్రూపులతో అవగాహన**

మిద్దె తోటల (టెర్రస్ గార్డెన్‌ల) అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకరి అనుభవాలు మరొకరు పంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సమష్టిగా మొక్కలు తెప్పించుకుంటున్నారు. కర్నూలు టెర్రస్ గార్డెనర్స్ వాట్సాప్ గ్రూపు 135 మందితో ప్రాచుర్యంలో ఉంది. సిటీ టెర్రస్ గార్డెనర్స్ గ్రూపు కూడా ఉంది. ఇందులో వివిధ నగరాలకు చెందిన వారు వేలాదిగా ఉన్నారు. ఈ గ్రూపులో కర్నూలు నగరానికి వారు దాదాపు 200 మంది సభ్యులుగా ఉన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో ఉన్న వారు ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశమై పలు విషయాలపై చర్చిస్తున్నారు. మొక్కల పెరుగుదల, చీడ, పీడల నివారణ తదితర అంశాలపై అనుభవాలను పంచుకుంటున్నారు. తోటల పెంపకానికి వర్మీకంపోస్ట్, చెరువు మట్టి, వేపచెక్క, వేపకషాయం వంటి వాటిని వినియోగిస్తున్నారు. చీడపీడలను వేప ఉత్పత్తులతో నివారించుకుంటారు. ఆరోగ్యవంతమైన పద్ధతులతో మిద్దెతోటలు కర్నూలు నగరంలో అభివృద్ధి చెందుతున్నాయి.



పూల మొక్కను చూపుతున్న ఈమె పేరు జి.సుచిత్ర, బీ.క్యాంపులో కొత్త హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇంటి మూడో అంతస్తు పైభాగం 1000 చదరపు అడుగులు ఉండగా, ఇందులో 500 చదరపు అడుగుల్లో మిద్దె తోటను అభివృద్ధి చేశారు. ద్రాక్ష, స్ట్రాబెర్రి, నిమ్మ, వంకాయ, టమాటా, మిర్చి పండిస్తున్నారు. కర్నూలు టెర్రస్ గార్డెనర్స్ గ్రూపులో ఉండి.. ఇతరుల అనుభవాలను కూడా తెలుసుకుంటున్నారు.



ఈ చిత్రంలో కనిపించే వ్యక్తిపేరు తోట హరికృష్ణ. కల్లూరు మండలం పెద్ద టేకూరు గ్రామానికి చెందిన ఈయన వర్మీకంపోస్ట్ తయారు చేస్తున్నారు. ఈయన కర్నూలుతో పాటు ఇతర పట్టణాల్లో టెర్రస్ గార్డెన్ అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారు. గార్డెన్‌కు అవసరమైన ఇన్‌పుట్స్, సాంకేతిక సహకారం అందిస్తారు. కర్నూలు టెర్రస్ గార్డెన్ వాట్సాప్ గ్రూపు సృష్టించి ఒకరి అనుభవాలు మరొకరు పంచుకునే విధంగా తోడ్పడుతున్నారు. టెర్రస్ గార్డెన్ అభివృద్ధి చేసుకునే వారికి అవసరమైన మట్టి, కోకోపీట్, వర్మీకంపోస్ట్, వేపపిండి, వేప చెక్క, చీడపీడల నివారణకు అవసరమైన కషాయాలు సరఫరా చేస్తుంటారు.

# వైభవోపేతం.. అహోబిలేశుడి బ్రహ్మోత్సవం

- శేష, చంద్రప్రభ వాహనాలపై దర్శనమిచ్చిన ప్రహ్లాదవరదుడు
- శరభ వాహనంపై ఊరేగిన శ్రీ జ్వాలా నరసింహుడు



మాడ వీధుల్లో శేషవాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఐదో రోజైన గురువారం శ్రీ ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో శేషవాహనం అధిరోహించి మాడ వీధుల్లో ఊరేగారు. అంతకు ముందు సుప్రభాత సేవతో మూలవిరాట్ శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను మేల్కొలిపారు. దివ్య దర్శనం అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి పట్టు వస్త్రాలతో అలంకరించారు. వివిధ రకాల స్వర్ణాభరణాలు ధరించిన ప్రహ్లాదవరదుడు విశేషంగా ముస్తాబైన ఉభయ దేవేరులతో తొమ్మిది తలల శేషవాహనం అధిష్టించి మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులను యాగశాలలో కొలువుంచి పంచామృతాభిషేకం, జలాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అద్దాల మండపంలో కొలువుంచారు. రాత్రి శ్రీ ప్రహ్లాదవరదుడు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

**ఎగువ అహోబిలంలో..**

ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాలా నరసింహస్వామి గురువారం శరభ వాహనం అధిరోహించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం నిత్య పూజల అనంతరం ఉత్సవమూర్తులైన జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించి యాగశాలలో కొలువుంచారు. రాత్రి శ్రీ జ్వాల నరసింహస్వామిని శరభ వాహనంపై కొలువుంచి మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

### అహోబిలం చేరిన చిలకల దండ



పూర్ణకుంభంతో చిలకల దండను తీసుకొస్తున్న అహోబిలం మఠం మణియార్

తమిళనాడు రాష్ట్రం శ్రీవల్లీపుత్తూరు దేవస్థానంలో కొలువైన మూలమూర్తి ఆండాల్ అమ్మవారి చిలకలదండ గురువారం అహోబిలం చేరింది. తమిళనాడు నుంచి విమానంలో కడపకు తీసుకువచ్చి అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా ప్రత్యేక వాహనంలో అహోబిలానికి తీసుకువచ్చారు. చిలకల దండను ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ్‌ల ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఆలయంలోకి చేర్చి భద్రపరిచారు. ఈ దండను శుక్రవారం మోహిని అలంకరణలో ప్రహ్లాదవరదస్వామికి ఉపయోగించనున్నారు.



శరభ వాహనంపై ఊరేగుతున్న జ్వాలా నరసింహస్వామి



చంద్రప్రభ వాహనంపై ప్రహ్లాదవరదుడు



శేషవాహనంపై ఉభయ దేవేరులతో ప్రహ్లాద వరదుడు

# తండ్రిని చంపిన తనయుడు



హత్యకు గురైన పల్లె వెంకటేశ్వర్లు(ఫైల్)

పగిడ్యాల: అనుమానం పెనుభూతమై ఓ తండ్రిని తనయుడే కడతేర్చేందుకు కారణమైంది. ఈ ఘటన పడమర ప్రాతకోటలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట ఎస్సీ కాలనీకి చెందిన పల్లె వెంకటేశ్వర్లు(53) నీటిపారుదల శాఖలో పాణ్యం డివిజన్ 6వ బ్లాక్‌లో లస్కర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య మద్దమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. ముగ్గురు పిల్లలకు పెళ్లిళ్లు చేసి ఉన్నంతలో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే పెద్ద కుమారుడైన శ్రీకాంత్‌కు 7 ఏళ్ల క్రితం పారుమంచాల గ్రామంలోని విశ్రాంతమ్మ అలియాస్ మానసతో పెళ్లి జరిపించాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కొద్ది రోజులుగా మానస, శ్రీకాంత్‌లు గొడవ పడి పుట్టింటికి వెళ్లి అత్తమామలపై జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్‌లో వేధింపుల కేసు పెట్టింది. అప్పటి నుంచి శ్రీకాంత్ తన భార్యతో తండ్రి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అనుమానం పెంచుకున్నాడు. అది మనసులో పెట్టుకొని బుధవారం అర్ధరాత్రి ఇంటి కాంపౌండ్‌లో నిద్రిస్తున్న తండ్రి ముఖంపై స్టీల్‌రాడ్‌తో మోది పారిపోయాడు. కొన ఊపిరితో విలవిల్లాడుతున్న దృశ్యాన్ని భార్య మద్దమ్మ, చిన్న కుమారుడు రాంబాబు గమనించి 108 వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. రాంబాబు ఫిర్యాదు మేరకు ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పరారీలోని శ్రీకాంత్‌ను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.



# అంజీర..లాభాలు భళా!

- సబ్సిడీలు ఇస్తున్న ప్రభుత్వం



షేడ్‌నెట్‌లో అంజీర పండ్లను ఆర బెట్టిన దృశ్యం



భూపాల్‌రెడ్డి సాగు చేసిన అంజీర తోట



డ్రైఅంజీర పండ్లు

బేతంచెర్ల: వేసిన పంటలే వేస్తూ నష్టపోకుండా ఓ యువ రైతు భిన్నంగా ఆలోచించాడు. వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ అంజీర సాగు చేపట్టాడు. రెండేళ్లలోనే పెట్టుబడి ఖర్చులన్నీ వెళ్లిపోతున్నాయి. మూడో ఏట నుంచి లాభాలు రానున్నాయి. బేతంచెర్ల మండలం సీతారామాపురం గ్రామం చామంతి పూలకు ప్రసిద్ధి. గ్రామానికి చెందిన రైతు చిట్టి భూపాల్ రెడ్డి పూల తోటలకు స్వస్తి చెప్పి 2021లో నాలుగు ఎకరాల్లో అంజీర సాగు చేపట్టాడు. ఇందుకోసం కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి ఒక్కో మొక్కను రూ.40 చొప్పున కొనుగోలు చేశారు. ఎకరాకు 400 మొక్కల చొప్పున నాటాడు. నాటిన తరువాత 2022లో రెండు టన్నుల దిగుబడి వచ్చింది. పండ్లను అరబెట్టగా 500 కేజీలు వచ్చాయి. కేజీ రూ.1,000 చొప్పున విక్రయించగా రూ.5 లక్షలు వచ్చింది. ఈ ఏడాది (2023) కూడా అంజీర పండ్ల కోతలు ప్రారంభమయ్యాయి. మే వరకు ఉండనున్నాయి. ఈ ఏడాది 6 టన్నుల దాక దిగుబడి రానుందని, వాటిని ఆరబెడితే 1,500 కేజీలు వస్తుందని రైతు తెలిపారు. పంట సాగుకు మొదట్లో పెట్టిన రూ.20 లక్షలు ఈ ఏడాదితో తీరిపోతాయని, వచ్చే ఏడాది నుంచి అంతా మిగులు బాటు అవుతుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

**సాగులో మెలకువలు ఇలా..**

అంజీర తోటకు నెలకు ఐదు తడుల చొప్పున డ్రిప్ ద్వారా నీరు అందించాలి. కోతలు ప్రారంభమైన తరువాత రోజు విడిచి రోజు నీటి తడులు కట్టాలి. కోతలు అయిన నెల రోజుల తరువాత కొమ్మలు కత్తిరించాలి. మొక్కల ఎదుగుదలకు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, వేప పిండి, ఆముదం పండి కలిపి వేయాలి. పూర్తిగా సేంద్రియ సాగులో చేపడితే పెట్టుబడి తగ్గుతుంది. ఎలాంటి రసాయన అవశేషాలు లేకపోవడంతో అంజీర పండ్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది.


### అంతర్ పంటలు సాగు చేయవచ్చు



వ్యవసాయంపై నాకు మక్కువ ఎక్కువ. వినూత్నంగా అంజీర సాగు చేపట్టా. ఏడాదికి 4 ఎకరాల సాగుకు రూ.2 లక్షల పెట్టుబడి వస్తుంది. పండ్లను ఆరబెట్టేందుకు షెడ్ నెట్‌ను ఏర్పాటు చేసుకున్నా. ప్యాకింగ్ హౌస్‌కు ప్రభుత్వం నాకు రూ.2 లక్షల రాయితీ ఇచ్చింది. డ్రై యూనిట్ ఉండటం వల్ల పండ్లను ఇక్కడే నిల్వ ఉంచి మార్కెట్ ధరలకు అమ్ముకోవడానికి అవకాశం ఏర్పడింది. అంజీరలో అంతర పంటలుగా చామంతి, బంతి, కాకర, బీర, టమాటా సాగు చేయవచ్చు.

– రైతు చిట్టి భూపాల్ రెడ్డి

### తేలికపాటి నేలలు అనుకూలం



నీటి వసతి ఉన్న ఎర్ర, తువ్వ, తేలికపాటి నేలలు అంజీర సాగుకు అనుకూలం. ఎండ బెట్టిన పండ్లను సూపర్ మార్కెట్లు, దుకాణాల్లో అమ్ముతుంటారు. ఈ పండ్లు తినడం వలన రక్తహీనత తగ్గి గర్భిణులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారు. ఉద్యాన శాఖ తరపున రెండేళ్లకు హెక్టారుకు రూ.18 వేలు సబ్సిడీ ఇస్తున్నాం.

– రఘువీర్, ఉద్యాన శాఖ అధికారి